పంటల ఉసురుతీస్తున్న పొగమంచు

- పూర్తిగా నష్టపోనున్న ఉలవ రైతులు
- ఉద్యాన పంటలపై కూడా ప్రభావం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ విన్నపం


ఉలవ పంటను ఆవరించిన పొగమంచు


మామిడి తోటను ముంచేసిన పొగమంచు

రామాపురం : ఏటా కొండంత పంటల సాగుపై రైతన్నల ఆశలు ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో ఊరిస్తున్న రుతుపవనాలు కొద్దోగొప్పో పంటల సాగు చేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూపే మిగులుతోంది. మండలంలో సాధారణ పంట సాగు సుమారు వెయ్యి హెక్టార్లకుపైగా ఉన్నా ఇందులో 20శాతం పంట సాగుకు నోచుకోలేదు. అందునా ఈ యేడు వర్షాభావం కారణంగా వేరుశనగ పంట స్థానంలో ఉలవ పంటను సాగు చేశారు. ఇందులో అంతర పంటగా, సాధారణంగా 180 హెక్టార్లలో సాగు చేశారు. పంట ఏపుగా పెరిగినా 20 రోజుల్లో కోతకు వచ్చే తరుణంలో గత వారం రోజులుగా ఉదయం 6గంటలపాటు ప్రతి రోజు పొగమంచు కారణంగా సాగు చేసిన ఉలవ, కంది, మామిడి పూత(తోటలు), అనప, అలసంద పంటలు ఇతర పంటలు దెబ్బతినే స్థితికి చేరుకుంటున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. పెట్టిన ఫలసాయం కూడా అందే పరిస్థితి లేదంటున్నారు. నవంబర్, డిసెంబర్ మాసంలో తుపానులు కాగా ఇప్పుడు పొగ మంచు వల్ల రైతుల కోలుకొనే స్థితి లేదంటున్నారు. ప్రభుత్వం తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని మండల రైతాంగం విన్నవిస్తున్నారు.

ఉలవ పంట సాగు చేశాను



నాలుగు ఎకరాలలో ఉలవ పంటను సాగు చేశాను. ఇందుకు సుమారు 20వేలకు పైగా ఖర్చు చేశా. పంట ఏపుగా పెరిగింది. కానీ వాతావరణంలో మార్పుల వల్ల పంట దెబ్బతింటోంది. అందునా నవంబరు, డిసెంబరులో తుపాను నానుపు వర్షం కారణంగా గడ్డి విపరీతంగా పెరిగింది. దీంతో రెండు పర్యాయలు కలుపుతీసినా ఆశించినంత పంట దిగుబడి వచ్చేలాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

– బాలక్రిష్ణ రైతు, కుమ్మరపల్లె, రామాపురం మండలం

అంతర్ పంటగా వేశాను



మామిడి తోటలో అంతర్‌పంటగా ఉలవను సాగు చేశాను. పంట వేసినప్పటి నుంచి వాతావరణం అనుకూలంగా లేదు. పైగా పంట ఏపుగా పెరిగినా ఆశించిన పంట వచ్చేలా లేదు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కేలా లేదు. మామిడిపై కూడా పొగమంచు ప్రభావం అధికంగా ఉంది. ఇప్పటికీ పూత సరిగా లేదు. మామిడిలో మంచి దిగుబడి రాకుంటే తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సిందే.

– అయూబ్ రైతు, నీలకంఠ్రావుపేట, రామాపురం మండలం

పొగ మంచు కారణంగా దిగుబడిపై ప్రభావం

వాతావరణంలో మార్పులు, అధిక తుపానుల వల్ల వర్షం లేక పంటలకు ఒకింత దిగుబడి బరువులేకపోవడం జరిగింది. గతంలో ఎన్నడూ లేనంతగా పొగ మంచు ఈ సంవత్సరం జనవరిలో ఉదయం వేళల్లో గంటలపాటు కమ్ముకోవడంతో వాటి ప్రభావం పలు పంటలు ఉద్యానవన పంటలకు దెబ్బతీస్తోంది.

– నాగమణి, ఏఓ, రామాపురం మండలం

క్లుప్తంగా

19న ఉచిత వైద్య శిబిరం

సుండుపల్లె : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఈనెల 19వ తేదీ ఆదివారం మానవత సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య శిబిరంలో పాల్గొనే వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మకు పూజలు

సిద్దవటం : మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండుగ సందర్భంగా బుధవారం రాత్రి గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దవటంలో గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపులో స్థానిక మహిళలు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొని గొబ్బెమ్మ పాటలను పాడారు. ఈ పండుగ రోజున ముగ్గులు వేసి ముగ్గులో గొబ్బెమ్మను పెట్టి పసుపు, కుంకుమతో అలంకరిస్తారన్నారు. ముగ్గులో పెట్టే గొబ్బెమ్మను గోదాదేవిగా పూజిస్తామన్నారు. పండుగ రోజుల్లో ముగ్గు మధ్యలో గొబ్బెమ్మను పెడితే ఇంట్లోకి లక్ష్మీదేవిని ఆహ్వానించినట్లేనని మహిళల్లో విశ్వాసమని మహిళలు పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ


అమరేశ్వరీ, తహసీల్దార్

పెనగలూరు : మండల తహసీల్దార్‌గా అమరేశ్వరీ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె కోడూరులో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ పెనగలూరుకు బదిలీపై వచ్చారు. అలాగే పెనలూరులో తహసీల్దార్‌గా ఉన్న ఇంద్రాణి కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. గత ఎన్నికలలో జిల్లా బదిలీలో భాగంగా కర్నూలు నుంచి పెనగలూరుకు తహసీల్దార్‌గా వచ్చారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం


బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ భక్తవత్సలం

సంబేపల్లె : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎస్‌ఐ భక్తవత్సలం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించారు. మొదట బాలా లెవెన్ జట్టు 20 ఓవర్లకు 235 చేయగా, సంబేపల్లె టీమ్ 20 ఓవర్లకు 183 పరుగులు చేశారు. దీంతో బాలా లెవెన్ టీమ్ గెలిచింది. అనంతరం గెలిపొందిన జట్టుకు రూ. 13,000, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.7,000 లను అందజేశారు. ప్రతి ఒక్కరు క్రీడలలో పాల్గొని శరీర దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌ఐ అన్నారు.

అనపకాయలకు మార్కెట్‌లో భలే డిమాండ్

గుర్రంకొండ: సంక్రాంతి నేపథ్యంలో అనపకాయలకు మార్కెట్‌లో భలే డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ధర రూ.100 పలుకుతోంది. సాధారణంగా పల్లెల్లో సంక్రాంతి పండగ వారం రోజుల పాటు జరుపుకొంటారు. ఈ వారం రోజుల్లో తప్పని సరిగా ఇళ్లలో ఆనపకాయలు, గింజల కూరలు ఉండాల్సిందే. రోజూ ఉదయం దోసెల్లోకి చట్నీ, సాంబారుకు బదులుగా అనపగింజల కూర ఎక్కువగా తీసుకొంటారు. వీటికి తోడు పగలు, రాత్రిళ్లు ఉడకబెట్టిన ఆనపకాయల్ని స్నాక్స్‌గా తీసుకొంటారు. రాత్రిళ్లు అనపకాయల్ని నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే గింజల్ని వంటల్లో వినియోగిస్తుంటారు. ఈ ఏడాది అనపకాయల సాగు తక్కువగా ఉండడం, దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది.

ఆర్టీసీ సురక్షిత ప్రయాణానికి మారుపేరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ అంటే సురక్షిత ప్రయాణానికి మారుపేరని జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం డిపో మేనేజర్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీటీసీ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు డ్రైవింగ్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఘాట్‌రోడ్డులో డ్రైవింగ్ చేసే సమయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగరంలో వాహనాలు నడిపే సమయంలో జాగరూకతతో వ్యవహరించాలన్నారు. నైట్ సర్వీసుకు వెళ్లే డ్రైవర్లలో కంటి చూపులో తేడా ఉన్న వారు విధులకు వెళ్లకుండా ఉండడం మంచిదన్నారు. ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రమాదాలు చేసిన డ్రైవర్లకు విడతల వారీగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణను ప్రతి ఒక్క డ్రైవరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు ఇంధన పొదుపుతోపాటు క్షేమకరమైన డ్రైవింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, ఎస్‌టీఐ మంజుల, నాగమణి, లలితమ్మ, డీఎం ఆఫీసు సూపరింటెండెంట్ అల్లాబకష్ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు అధికారుల సూచనలు తప్పనిసరి


వెలుగుపల్లెలో దోసపంటకు వాడిన మందును పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

సిద్దవటం : మండలంలోని వెలుగుపల్లె, జంగాపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్టు బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగుపల్లె గ్రామంలో గ్రామ సభను నిర్వహించి వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, నూతన సాంకేతిక అంశాలను, డ్రోన్ టెక్నాలజీ, ప్రకృతి వ్యవసాయ విధానాలు వివరించడం జరిగిందన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఈ గ్రామంలో దోస, కర్బూజ, నువ్వులు, వరి, మామిడి, పంటలను సాగు చేస్తున్నారు. దోస ప్రధాన పంటగా సాగు చేసినట్టు తెలియజేశారు. పురుగు ఆశించివుంటే అధికారుల సూచనలతో మందులు పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం ఆయన జంగాలపల్లెలో వరి పంటను పరిశీలించారు. వరిలో చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఇ–పంట నమోదు, జీఎస్టీ బిల్లులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం సిద్దవటం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివకుమార్, రైతులు కుప్పం వెంకట సుబ్బారెడ్డి, మాచనూరు వెంకట సుబ్బారెడ్డి, మద్దిక నాగసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం


వీరబల్లి: కార్యకర్త సుబ్బయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

వీరబల్లి : మండలంలో గుర్రప్పగారిపల్లి పంచాయతీలో బెజవాడ హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెజవాడ సుబ్బయ్య అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి సుబ్బయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గుర్రప్పగారిపల్లి సర్పంచ్ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరామ రాజు, శ్రీరాముల రెడ్డి, మునిరాజు, చక్రినాయుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బీకే మణి తల్లి సుబ్బలక్ష్మమ్మ దశదిన కర్మకాండలో అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మృతురాలి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్ సిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, కుమార్ రెడ్డి, రామనాథం, సుదర్శన్ రెడ్డి, రాంబాబు, రమణా రెడ్డి, కొమ్మనవారిపల్లి రాజారెడ్డి, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మల నిమజ్జన వేడుక


రాజంపేట టౌన్: గొబ్బెమ్మ (గౌరమ్మను) నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు, పాల్గొన్న యువకులు


నందలూరు: గొబ్బెమ్మను ఊరేగిస్తున్న మహిళలు

రాజంపేట టౌన్ : ముక్కనుమను పురస్కరించుకొని గురువారం రాత్రి నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో గొబ్బెమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొబ్బెమ్మ ప్రతిమను గ్రామాల్లో ఊరేగించారు. ఊరేగింపు సందర్భంగా మహిళలు గొబ్బెమ్మ పాటలు పాడుతూ ముందుకు సాగారు. అలాగే పలు ప్రాంతాల్లో గ్రామదేవతల వద్ద గొబ్బెమ్మను పెట్టి పూజలు చేశారు. పలు గ్రామాల్లో డీజేలు పెట్టగా యువత డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. గొబ్బెమ్మను ఊరేగించిన అనంతరం సమీపంలో ఉన్న చెరువుల్లో నిమజ్జనం చేశారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని మహిళలు గొబ్బెమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పండుగ మూడు రోజులు గొబ్బెమ్మలను తయారు చేసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేకంగా పూజలు చేసి, గ్రామంలో గొబ్బెమ్మను ఊరేగిస్తూ, మహిళలు కోలాట నృత్యాలు చేస్తూ చెయ్యేరుకు తరిలారు. గొబ్బెమ్మను నీటిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన గుండు గంగమ్మ జాతర


గుండు గంగమ్మకు పూజలు చేస్తున్న ఆలయ అర్చకుడు బలరామయ్య

రామాపురం : మండలంలోని గోపగుడిపల్లె కస్పాలో వెలసిన శ్రీ గుండు గంగమ్మ జాతర గురువారంతో ముగిసింది.

రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పందిళ్లపల్లి బలరామయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం రాత్రి గ్రామంలో ఏడు చాందిని బండ్లు ఆలయం చుట్టూ తిప్పారు. జాతరలో చాందిని బండ్లు తిరిగేటప్పుడు కోలాటాలు, చెక్కభజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

కురబలకోటలో హై అలెర్ట్!


కొండయ్య నాయుడు, డీఎస్పీ, మదనపల్లె

కురబలకోట: కురబలకోట మండల పరిషత్ కార్యాలయంతోపాటు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పోలీస్ యాక్టు అమలులో ఉన్నట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య తెలిపారు. కురబలకోట మండల మీట్ జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం సమావేశం ప్రశాంతంగా నిర్వహించడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, జనం గుమికూడినా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండల పరిషత్ పరిసర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. మండల మీట్ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. రెవెన్యూ 144, 30 పోలీస్ యాక్టు, 163 కొత్త చట్టం అమలులో ఉన్నట్లు తెలిపారు. చట్టాలను అతిక్రమిస్తే కటకటాల పాలు కాక తప్పదని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించరాదని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రాంతంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, భేటీలు నిర్వహించరాదన్నారు. ఆంక్షలు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు. కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని ఆయన తెలిపారు. ఆయన తెలిపారు. ఆయన వెంట ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రధాని మోడీ పాలన విధ్వంసకరం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధ్వంసకర పరిపాలన చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ , నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని 31వ డివిజన్‌లో జై బాపూజీ.. జై భీమ్ జై సం విధాన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలోని ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిందని, కేవలం మత ప్రాతిపదికన భారతదేశ సమాజాన్ని చీల్చి అధికార పబ్బం గడుపుతున్నారని ఆయన ధ్వజమెత్తారు.

ఇటీవల పార్లమెంటులో బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అమానుష వ్యాఖ్యలు దీనికి నిదర్శనం అన్నారు. అనంతరం స్థానిక రెండో గాంధీ విగ్రహం వద్ద గోడ పత్రాలను కాంగ్రెస్ పార్టీ నేతలు ఆవిష్కరించారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీ కరపత్రాలను ప్రజలకు పంచుతూ బీజేపీ చేస్తున్న దుర్మార్గపు పాలనను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రహమతుల్లా ఖాన్, సీనియర్ నేతలు వెంకటేష్, సిరాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ : సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌వర్మ, షేక్ అల్లాబకష్, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు గురువారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజకు విన్నవించారు. గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌ఛార్జిలు విడుదల చేయాలని, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి రావాల్సిన నిధులను ఇవ్వాలని కోరారు. సర్పంచులకు కొన్ని నెలలుగా బకాయి ఉన్న గౌరవ వేతనాలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగులకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయినవారు అర్హులన్నారు. 35 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

అనంతరాజుపేట రైల్వేగేటు మూసివేత

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట వైకోట క్రాసింగ్ రైల్వేగేటు మరమ్మతుల కారణంగా రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు గురువారం రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 ఉదయం 7 గంటల నుంచి 20 సాయంత్రం 6 గంటల వరకు మూసివేసి మరమ్మత్తులు చేసి ఆధునీకికరణ పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

నివాళి


నివాళి అర్పిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : మండల వైస్ ఎంపీపీ గూడురు గౌరీశంకర్‌రాజు బాబాయ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గూడూరు సుబ్బరామరాజు గుండెపోటుతో మృతి చెందారు. గురువారం విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బొమ్మవరం గ్రామానికి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు వెలగచర్ల శివారెడ్డి, ఎంపీటీసీ బండారు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందజేస్తాం


ధ్వంసమైన బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

చిట్వేలి : అడవి పందులు ధ్వంసం చేసిన బొప్పాయి తోటలను రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ గురువారం పరిశీలించారు. ఇటీవల మైలపల్లి పంచాయతీ ఎం.రాచపల్లిలో బొప్పాయి తోటలను అడవి పందులు ధ్వంసం చేశాయి. ఈశ్వరరాజు, పెంచల్ రాజు, చాముండేశ్వరీ తదితరులకు చెందిన తోటల్లో 28 వేల బొప్పాయి మొక్కలను పందులు తినేశాయి. దీంతో లక్షలాది రూపాయలు రైతులకు పంటనష్టం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పొలాల వద్దకు వెళ్లి పరిశీలించి రైతులను పరామర్శించారు. అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి పంటనష్టం పరిహారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు త్వరలో ఉద్యమం


పండుగోలు మణి

రైల్వేకోడూరు అర్బన్ : ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు తప్పా కార్మికులకు, పేద ప్రజలకు చేసింది శూన్యమని, సూపర్ సిక్స్ పథకాలు, హామీలు అమలుకు ఉద్యమాలకు ఎర్ర సైన్యం సిద్ధం కావాలని గురువారం జిల్లా బీకేఎంయూ అధ్యక్షుడు పండుగోలు మణి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి నాయకులు, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవణ్‌కల్యాణ్‌లు మరిచారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు పేద ప్రజలు, కార్మికులకు హామీలు ఇచ్చి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి ఒక్క హామీ కూడా అమలు చేయకుండా పరిపాలిస్తున్నారని వాపోయారు. అన్నమయ్య జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేటు పరం చేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలు, కార్మికులకు కూటమి ఇచ్చిన హామీల అమలుకు త్వరలో ఉద్యమాలు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల నడుమ విద్యార్థుల సమ్మేళనం


విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో 1990 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

గాలివీడు : పుట్టిన ఊరు.. కన్నతల్లి.. చదువుకున్న పాఠశాల ద్వారా ఎంత ఎత్తుకు ఎదిగినా మరువకూడదని గుర్తు చేస్తూ చదువు చెప్పిన ఉపాధ్యాయులతో కలిసి అలనాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ 1985–1990 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆనందోత్సాహాల నడుమ జరిగింది. గురువారం మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థులు తమ గురువులతో కలసి చిన్ననాటి మధురానుభూతులను పంచుకున్నారు. సరిగ్గా 40 సంవత్సరాల తరువాత వారంతా ఒకేచోట చేరడంతో పాఠశాల ప్రాంగణంలో భావోద్వేగ వాతావరణం కనిపించింది. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా చదివిన పాఠశాల, ఉపాధ్యాయులను గుర్తించుకుని ఇలా ఆత్మీయ సమావేశం నిర్వహించడం ద్వారా బంధాలు బలపడతాయన్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రిన్సిపల్ రామసుబ్బారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు మలన్న, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివారెడ్డి, సుబ్బారాయుడు, గౌస్‌మొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట చెరువుకు నీరు విడుదల

ఒంటిమిట్ట : మండలంలోని ఒంటిమిట్ట చెరువుకు గురువారం టీడీపీ రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ నాయుడులు శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా సోమశిల వెనుకజలాలను విడుదల చేశారు. శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుకజలాలు వదిలే పైప్ లైన్ దెబ్బతినడంతో గత కొన్ని నెలలుగా చెరువుకు నీరు విడుదల చేయలేదు. పైప్‌లైన్ సమస్యను రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లి మరమ్మతు పనులు చేయించారు. గురువారం ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుకజలాలను సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట చెరువు ప్రెసిడెంటు గంగిరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా సంక్రాంతి క్రీడా టోర్నమెంట్లు


తలబడుతున్న కంబాలకుంట, ఎంఎస్ లెవెన్ జట్లు


వాలీబాల్ మ్యాచ్‌లో ఓబిలి, పెనగలూరు జట్లు

పెనగలూరు : కంబాలకుంట యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు గురువారం పెనగలూరు హైస్కూల్ గ్రౌండ్‌లో పోటాపోటీగా జరిగాయి. కంబాలకుంట, ఎంఎస్ లెవన్ జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నువ్వా.. నేనా అన్నట్టుగా సాగింది. ఒక బాలు మిగిలి ఉండగానే ఎంఎస్ లెవన్ విజయం చేజిక్కించుకుంది. ఈ టోర్నమెంట్‌లో మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ. 50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు నగదు బహుమతి అందజేయనున్నారు.

మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్

మండలస్థాయి వాలీబాల్ టోర్నీ పోటీలు హైస్కూల్ గ్రౌండ్‌లో రసవత్తరంగా సాగాయి. ఓబిలి, పెనగలూరు జట్ల మధ్య జరిగిన పోటీలో ఓబిలి జట్టు విజేతగా నిలిచింది. ఈ వాలీబాల్ టోర్నమెంట్‌కు మొదటి బహుమతి కింద రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు అందజేయనున్నట్టు నిర్వాహకుడు లింగం నరేష్ ప్రకటించారు. కాగా టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్నాయి.